ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 తమిళనాడు
సోమవారం 13 జనవరి 2025





సుశీంద్రం తానుమాలయ స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుశీంద్రం, చిదంబరంలో నేత్రపర్వంగా మహారథోత్సవాలు

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళ మార్గళి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన మహారథోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. కన్నియాకుమారి జిల్లా సుశీంద్రం తానుమాలయ స్వామివారి ఆలయంలో, కడలూరు జిల్లా చిదంబరం శైవక్షేత్రంలో ఆదివారం ఉదయం మహారథోత్సవాలు ఘనంగా జరిగాయి. సుశీంద్రం ఆలయంలో తమిళ మార్గళి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ముచ్చటగా మూడు రథాల ఊరేగింపు జరిగింది. ఈ మూడు రథాలు చతుర్మాడ వీధుల్లో ఊరేగాయి. మహారథంలో స్వామివారు, అమ్మవారి రథంలో అరం వలర్త నాయకి, పిళ్లయార్ రథంలో గణపతి ఆశీనులయ్యారు. ఆ తర్వాత ఆలయ ప్రధానార్చకులు మూడు రథాల్లో వేంచేసిన మూర్తులకు దీపారాధన చేశారు. ఆ తర్వాత ఈ మూడు రథాల మోకుతాళ్లను భక్తులు లాగుతూ ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ రథోత్సవంలో ఎమ్మెల్యే దళవాయి సుందరం, నాగర్‌కోవిల్ కార్పొరేషన్ మేయర్ మహేష్, ఆలయ ట్రస్టు బోర్డు అధ్యక్షుడు ప్రభా రామకృష్ణన్, సుశీంద్రం పంచాయతీ అధ్యక్షురాలు అనుసియి, స్వామి పద్మేంద్ర, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌కుమార్, డీఎంకే యువజన విభాగం నాయకుడు అగస్టీశన్, అన్నాడీఎంకే జిల్లా డిప్యూటీ కార్యదర్శి సుకుమార్ పాల్గొన్నారు. సోమవారం ఈ ఆలయంలో ఆరుద్రదర్శన వేడుకలు జరుగనున్నాయి.

చిదంబరంలో...

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చిదంబరం శివకామసుందరి సమేత నటరాజస్వామి ఆలయంలో ఆరుద్రదర్శన వేడుకల్లో భాగంగా ఆదివారం మహారథోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో మార్గళి ఆరుద్ర దర్శన ఉత్సవాలు ఈ నెల 4న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆ రోజు నుంచి వెండి చంద్రప్రభ వాహనం, స్వర్ణ సూర్యప్రభ వాహనం, వెండి భూత వాహనం, వెండి వృషభవాహనం, వెండి గజవాహనం, స్వర్ణ కైలాస వాహనంలో, స్వర్ణరథంలోను స్వామివారు ఊరేగారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆరుగంటలకు మంగళవాయిద్యాలు, దేవారం, తిరువాచకం, వేద మంత్రాలను వేద పండితులు పఠిస్తుండగా నటరాజమూర్తి, శివకామసుందరి అమ్మవారు రథంపై ఆశీనులయ్యారు. ఆ తర్వాత రథాన్ని మాడవీధుల్లో ఊరేగించారు.

నేడు ఆరుద్రదర్శనం..

వేడుకల్లో ప్రధాన ఘట్టమైన ఆరుద్రదర్శన ఉత్సవం సోమవారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. వేకువజాము 4 నుంచి ఉదయం 6 గంటల వరకు శివకామసుందరి సమేత నటరాజమూర్తికి మహాభిషేకం నిర్వహిస్తారు. ఉగయం 10 గంటలకు చిత్‌సభలో రహస్య పూజ, పంచ మూర్తుల ఊరేగింపు, మధ్యాహ్నం 2 గంటలకు ఆరుద్ర దర్శనం, జ్ఞానాకాశ చిత్‌సభ ప్రవేశం జరుగుతుంది. ఈ వేడుకలకుగాను దీక్షితార్ల సంఘం కార్యదర్శి వేంకటేశదీక్షితార్, డిప్యూటీ కార్యదర్శి సుందర తాండదీక్షితార్, ఆలయ నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేపడుతున్నారు.



చిదరంబరం ప్రధాన వీధిలో ఊరేగుతున్న మహారథం

రాష్ట్రానికి పండుగ కళ

భోగ భాగ్యాల భోగి వేడుక



రంగనాథన్ వీధిలో కొనుగోలుదారుల రద్దీ

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వచ్చిందంటే పల్లె నుంచి పట్టణం వరకు ముందుగా గుర్తుకువచ్చేది భోగి. ఈ పండుగతో ప్రారంభమై, మకర సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండుగ కోసం రాష్ట్రం ప్రత్యేకంగా ముస్తాబవుతోంది. భోగభాగ్యాలు ప్రసాదించే సంప్రదాయ భోగి పండుగను సోమవారం రాష్ట్రప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. పండుగ రోజుల్లో జల్లికట్టును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు దక్షిణ జిల్లాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు ప్రజలు సంస్కృతికి అద్దం పట్టేలా పండుగను కోలాహలంగా జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారు. అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్లు, సంతలకు పోటెత్తుతున్నారు. అదే విధంగా పశువుల సంతలో గొర్రెలు, ఎద్దుల కొనుగోళ్లు కూడా ఊపందుకున్నాయి. రాజధాని నగరం చెన్నైలోని ప్రధాన వాణిజ్య ప్రాంతాలైన టి.నగర్, ప్యారీస్, వాషర్‌మెన్‌పేట్, మైలాపూర్, అడయార్ తదితర ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి పండుగ రద్దీలో చోరీలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రేటర్ చెన్నై పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. పొంగల్‌కు అవసరమైన మట్టి కుండలను రంగులతో తీర్చిదిద్ది విక్రయిస్తున్నారు.





కోయంబేడు బస్ టెర్మినల్‌లో..., రైల్వే స్టేషన్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

భోగి పండుగ...

సోమవారం భోగి పండుగ సందర్భంగా తెల్లవారు జామున వేసే భోగిమంటలు చుట్టు తిరిగే చిన్నారుల సందడి నెలకొంది. వాయుకాలుష్యం లేని విధంగా భోగి మంటలు వేసుకొని పర్యావరణాన్ని కాపాడేందుకు సహకరించాలని రాష్ట్ర ప్రజలకు పర్యావరణ శాఖ పిలుపునిచ్చింది.

పెరిగిన ధరలు...

ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలు, తుఫాను కారణంగా వ్యవసాయానికి పేరుపొందిన దక్షిణాది జిల్లాల్లో పంటల దిగుబడి చాలా వరకు తగ్గిపోయిందని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో పొంగల్‌కు అవసరమైన చెరకు గడలు, పసుపు, అల్లం సహా కూరగాయల ధరలు, మట్టి పాత్రల ధరలు కూడా గత ఏడాది కంటే ప్రస్తుతం రెండింతలు పెరిగాయి. కోయంబేడు మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సంతకు ఆదివారం 250 చెరకు లోడు లారీలు, 94 అల్లం, పసుపు కొమ్ముల లారీలు వచ్చాయి. ఈ ఏడాది 15 చెరకు గడల కట్ట రూ.400 నుంచి రూ.500 వరకు ధర పలికింది. అలాగే తలా పది కొమ్ముల పసుపు రూ.60, అల్లం రూ.100 విక్రయించారు. మల్లె పూలు, ముద్దబంతి, చామంతి, కనకాంబరం రకాలు పూలు కిలో రూ.600 నుంచి రూ.1000 వరకు విక్రయించారు. కాగా పండుగ సీజన్‌లో వస్త్రాలు, ఆభరణాలు కొనుగోలుదారులతో షాపింగ్‌మాల్స్, వస్త్ర, జ్యూవెలరీ షాపులు కళకళలాడుతున్నాయి.



అమ్మకాలకు సిద్ధంగా చెరకు గడలు, అల్లం





డాక్టర్ శ్రీదేవి శివానందంకు కనియన్ పూంగుండ్రనార్ అవార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రవాస తమిళులకు

ప్రత్యేక శిక్షణ



'వేర్‌గలై తేడి' పథకం కింద ప్రవాస తమిళుల దినోత్సవానికి వచ్చిన వివిధ దేశాల విద్యార్థులతో సీఎం స్టాలిన్

- తమిళ భాష, సంస్కృతి, కళల వ్యాప్తి కోసం రూ.10 కోట్లతో పథకం
- ప్రవాస తమిళుల దినోత్సవంలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళ భాష, సంస్కృతీ సంప్రదాయాలు, తమిళ జానపద కళలు, తమిళ ప్రాచీన వాద్య సంగీతం వైశిష్ట్యాలను భావితరాలకు అందించేలా దేశవిదేశాల్లో నివసిస్తున్న తమిళులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రూ.10 కోట్లతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ పథకం అమలుకు వందమంది అధ్యాపకులు, తమిళ కళాకారులకు సునిశిత శిక్షణ ఇచ్చి వారిని దేశవిదేశాల్లో ఉన్న తమిళుల వద్దకే పంపి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నందంబాక్కం ట్రేడ్‌సెంటర్‌లో ఆదివారం ఉదయం ప్రవాస తమిళుల సంక్షేమం, పునరావాస శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవాస తమిళుల దినం-2025లో పాల్గొని దేశవిదేశాలలలో తమిళ భాష, సంస్కృతీ సంప్రదాయాలు, సాహిత్యం, జానపద కళల అభివృద్ధి కోసం పాటుపడుతున్న తమిళ ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్టాలిన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సింగపూర్, జపాన్, స్పెయిన్, అమెరికా తదితర దేశాల్లో పర్యటించినప్పుడు ఆయా ప్రాంతాల్లో ఉన్న తమిళులు తనకు అందించిన స్వాగత సత్కారాలను చూసి ఆశ్చర్యపోయానని తమిళనాట ఉన్నట్లే అనిపించిందన్నారు. ఎన్నో శతాబ్దాలకు ముందు వలసపోయిన తమిళులంతా ప్రస్తుతం వారి స్వరాష్ట్రాన్ని మరవకుండా తమిళ భాషా వ్యాప్తికి, తమిళ సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించేలా కృషిచేయడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. ప్రవాస తమిళుల దినం ప్రభుత్వం తరఫున నిర్వహించనున్నట్లు ప్రకటించగానే సుమారు వంద దేశాల నుండి తమిళ సంఘాల నాయకులు, ప్రతినిధుల నుండి అభినందనలు, శుభాకాంక్షలు వెల్లువెత్తాయన్నారు. ఈ వేడుకలకు సుమారు 50 దేశాల నుండి తమిళ ప్రముఖులు, భాషాభిమానాలు, తమిళ సాహిత్య అభిమానులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ ప్రభుత్వాల ప్రతినిధులు, మంత్రులు తరలిరావటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఏ ప్రాంతంలో ఉన్నా తమిళులు తమ ఉనికిని కోల్పోకూడదని, మాతృదేశాన్ని, స్వరాష్ట్రాన్ని మరువకూడదన్నారు.

అవార్డుల ప్రదానం...

ఈ వేడుకల్లో సింగపూర్‌కు చెందిన రాజారామ్ రామసుబ్బన్ (విద్యారంగం), జపాన్‌కు చెందిన ఎస్.కమలకన్నన్ షణ్ముగం (సామాజికాభివృద్ధి), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన డాక్టర్ శ్రీదేవి శివానందం (మహిళావిభాగం), లక్ష్మణన్ సోమసుందరం (వాణిజ్య విభాగం) దక్షిణ కొరియాకు చెందిన ఎస్.ఆరోగ్యరాజ్ (సైన్స్ అండ్ టెక్నాలజీ) సింగపూర్‌కు చెందిన డాక్టర్ గంగాధరసుందర్ (వైద్యవిభాగం), శ్రీలంకకు చెందిన కృష్ణకాంత్ సందీప్ (తమిళ సాంస్కృతిక రాయబారి)కు కనియన్ పూంగుండ్రనార్ అవార్డులను స్టాలిన్ ప్రదానం చేశారు. తమిళ్‌మామణి అవార్డును అమెరికాకు చెందిన డాక్టర్ విజయ్ జానకిరామన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్ఎం నాజర్, పొన్ముడి, దామో అన్బరసన్, రాజకన్నప్పన్, రాజేంద్రన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, శ్రీలంక మంత్రి రామలింగం చంద్రశేఖర్, న్యూ పప్పు గినియా గవర్నర్ సుశీంద్రన్ ముత్తువేల్, మలేసియా ఎంపీ డత్తో శ్రీ శరవణన్, రీయూనియన్ దీవి మేయర్ జోపెడియర్, డర్బన్ మాజీ మంత్రి రవి పిళ్లై, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్ మురుగానందం, ప్రవాస తమిళుల సంక్షేమ సంస్థ కార్తికేయశివసేనాపతి, సంస్థ సభ్యులు రామ్, మీరాన్, కాల్డ్‌వెల్ వేల్ నంబి, పుగళ్‌గాంధీ, మహమ్మద్ ఫైసల్, ముంబైమీరాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నిక..

ఇండిపెండెంట్ల కోసం 135 చిహ్నాలు



ఎన్నికల అధికారులతో ఈవీఎంలను పరిశీలించి స్ట్రాంగ్ రూమ్ నుంచి బయటకు వస్తున్న ఈరోడ్ కలెక్టర్ రాజగోపాల్

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గ ఉప ఎన్నికలో పోటీ చేసే ఇండిపెండెంట్ల కోసం 135 చిహ్నాలను కేటాయించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ మృతిచెందడంతో ఫిబ్రవరి 5న ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. శుక్రవారం ప్రారంభమైన నామినేషన్ ప్రక్రియలో ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్ వేశారు. ఈ ముగ్గురు ఇతర జిల్లాలకు చెందిన వారు కావడం గమనార్హం. ఆ నియోజకవర్గానికి సంబంధించి ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు. కాగా ఇండిపెండెంట్ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలతో మూడు చిహ్నాలు కోరాల్సివుంది. వీటిలో ఏదోఒక చిహ్నాన్ని రిటర్నింగ్ అధికారి కేటాయిస్తారు. ఒకే చిహ్నాన్ని ముగ్గురు కోరితే డ్రా పద్ధతిలో కేటాయిస్తారు.

480 ఈవీఎంలు...

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో 237 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో 480 ఈవీఎం లను ఉపయోగించనున్నారు. ఈ నేపథ్యంలో ఈవీఎంల పనితీరుపై బెల్ సంస్థ నిపుణులు ఈ నెల 6 నుంచి పరిశీలించారు. తొలి విడత పరిశీలన శుక్రవారంలో పూర్తి అయ్యాయి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈరోడ్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజగోపాల్ సుంకర మీడియాకు వివరించారు. మాక్ పోలింగ్ అనంతరం 19వ తేదీ నుంచి ఈవీఎంలను ఈరోడ్ కార్పొరేషన్ కమిషనర్ మనిష్‌కు అప్పగించనున్నట్లు తెలిపారు.



గిండి రాజ్‌భవన్‌లో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

పరందూరు పర్యటనకు విజయ్‌కి అనుమతి లభించేనా?

అడయార్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కాంచీపురం జిల్లా పరందూరు వద్ద నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ విమానాశ్రయం కోసం తమ భూములు ఇచ్చేందుకు 13 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. వారంతా కలిసి విమానాశ్రయ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. వీరిని కలుసుకోవాలని హీరో విజయ్ భావించారు. దీంతో తమిళ్ మక్కల్ కళగం కోశాధికారి వెంకట్‌రామన్ కాంచీపురం జిల్లా ఎస్పీని కలిసి అనుమతి కోరడంతో పాటు విజయ్ పర్యటన సమయంలో భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విమానాశ్రయ నిర్మాణ వ్యతిరేక పోరాట సంఘం నేతలను ఎవరూ కలుసుకోవడానికి వీల్లేదని పోలీసులు నిబంధన విధించారు. ఈ నేపథ్యంలో విజయ్ పరందూరు వెళ్ళి స్థానికులను కలుసుకుని, వారి సమస్యను తెలుసుకోవాలని భావిస్తున్నారు. దీనికి పోలీస్ యంత్రాంగం అనుమతిస్తుందా? లేదా? అన్న చర్చ ఇపుడు సాగుతుంది. దీనిపై పోలీస్ ఉన్నతాధికారులు స్పందిస్తూ, ఈ అంశంపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

సమాచార దృష్టి

4 నుంచి 'స్లాస్' పరీక్ష

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యాస సామర్థ్యం తెలుసుకొనేలా స్టేట్ లెవల్ అచీవ్‌మెంట్ సర్వే (స్లాస్) నిర్వహిస్తుంటారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి 3,5,8 తరగతులు చదువుతున్న 15.78 లక్షల మంది విద్యార్థులకు ఫిబ్రవరి 4 నుంచి 6వ తేది వరకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన మోడల్ ప్రశ్నపత్రాలను ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు మోడల్ టెస్ట్ నిర్వహించాలి. పరీక్షకు సంబంధించి సందేహాలను 14417 అనే టోల్ ఫ్రీ నెంబరు సంప్రదించి నివృత్తి చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఒక ప్రకటలో తెలిపింది.

రేపు పనిచేయనున్న వండలూరు జూ

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వండలూరు జూ పార్క్ మంగళవారం పనిచేయనుంది. ఈ పార్క్‌లో 2,500కి పైగా జంతువులున్నాయి. వీటిని వీక్షించేందుకు పిల్లలు, పెద్దలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. పర్యవేక్షణ పనుల కారణంగా ప్రతి మంగళవారం పార్క్ మూసివేస్తుంటారు. కానీ మంగళవారం సంక్రాంతి పండుగ కావడంతో, ఈ రోజు పార్క్ యధావిధిగా పనిచేస్తుందని పార్క్ అధికారులు తెలిపారు.

రేపు తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరం, శివారు ప్రాంతాలకు నడుపుతున్న సబర్బన్ రైళ్లు మంగళవారం తక్కువ సంఖ్యలో (ఆదివారం టైంటేబుల్)తో నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. పొంగల్ సందర్భంగా ఈ నెల 14వ తేది (మంగళవారం) ప్రభుత్వ సెలవు కావడంతో, చెన్నై సెంట్రల్-అరక్కోణం, చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, చెన్నై బీచ్-చెంగల్పట్టు మధ్య తక్కువ సంఖ్యలో సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది.

తిరుచెందూర్ హుండీ ఆదాయం రూ.4,71 కోట్లు

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి హుండీ ఆదాయం రూ.4.71 కోట్లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఆలయ హుండీలను నెలకు ఒకసారి లెక్కిస్తుంటారు. ఆ ప్రకారం, గత నెల రోజుల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల లెక్కింపు ఆలయ ప్రాంగణంలోని వసంత మండపంలో ఆలయ జాయింట్ కమిషనర్ ఎస్.జ్ఞానశేఖరన్ నేతృత్వంలో గురు, శుక్రవారాల్లో జరిగింది. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు రూ.4,71,90,172 నగదు, 1.603 కిలోల బంగారం, 52.230 కిలో వెండి, 12.7 కిలోల వెండి చెంబు, 1,117 విదేశీ కరెన్సీ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

20న పీఎం జాతీయ వృత్తి నిపుణుల శిబిరం

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టులో ప్రధాన మంత్రి జాతీయ వృత్తి నిపుణుల శిబిరం ఈ నెల 20వ తేది జరుగనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల సంఘాల భాగస్వామ్యంతో చెంగల్పట్టు వృత్తి విద్యా శిక్షణా కేంద్రంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో వివిధ వృత్తుల కోర్సులు పూర్తిచేసిన వారు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ పొందవచ్చు. మరిన్ని వివరాలకు 6379090205, 044-27426552 అనే నెంబర్లు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేవీ పాఠశాలలో పొంగల్ రోజు పరీక్షలా...?

● ఎంపీ వెంకటేశ్ ఖండన

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రియ విద్యాలయ పాఠశాలలో పొంగల్ రోజున పరీక్షలు నిర్వహించడంపై మదురై సీపీఎం ఎంపీ వెంకటేశన్ ఖండించారు. విద్యార్థులు పొంగల్ జరుపుకోలేని పరిస్థితి ఉందని, తమిళ సంస్కృతిపై జరిగే దాడిగా ఉందన్నారు. ఈ పరీక్షలను మరో తేదీకి మార్చాలని ఎంపీ వెంకటేశన్ డిమాండ్ చేశారు.

చెన్నై ఎగ్మూర్ మీదుగా అయోధ్యకు ప్రత్యేక రైలు

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం భారత్ గౌరవ్ పర్యాటక రైళ్లు నడుపుతున్న నేపథ్యంలో, ప్రస్తుతం 'మహా కుంభం-2025' పేరున నడుపనున్నారు. ఈ రైలు ఫిబ్రవరి 5వ తేది తిరునల్వేలి నుంచి అర్ధరాత్రి 1 గంటకు బయల్దేరి తెన్‌కాశి, రాజపాళయం, శివకాశి, విరుదునగర్, మదురై, దిండుగల్, తిరుచ్చి, తంజావూరు, మైలాడుదురై, చిదంబరం, విల్లుపురం, చెంగల్పట్టు, తాంబరం, చెన్నై ఎగ్మూర్ మీదుగా విజయవాడ మార్గంలో 7వ తేది మధ్యాహ్నం 12.30 గంటలకు బెనారస్ చేరుకుంటుంది. అనంతరం 8,9,10 తేదీల్లో వారణాసి, ప్రయాగ్‌రాజ్, అయోధ్య తదితర ప్రాంతాలకు వెళ్లనుంది. మరుమార్గంలో 10వ తేది అయోధ్య నుంచి రాత్రి 10 గంటలకు బయల్దేరి 13వ తేది తిరునల్వేలి చేరుకుంటుంది. ఈ రైలు 2 టైర్ ఏసీ, 2 త్రీ టైర్ ఏసీ, 7 స్లీపర్, మొత్తం 14 బోగీలతో నడువనుంది. వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

67 శాతం పొంగల్ బహుమతుల పంపిణీ

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 67 శాతం మందికి పొంగల్ బహుమతులు అందజేసినట్లు మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా 2,20,94,585 మంది బియ్యం కార్డుదారులు, శ్రీలంక శరణార్థులకు పొంగల్ బహుమతులు అందించాలని నిర్ణయించామన్నారు. ఆ ప్రకారం, ఈ నెల 9న పొంగ బహుమతుల పంపిణీని సీఎం స్టాలిన్ ప్రారంభించారని తెలిపారు.

పొంగల్ వేడుకల్లో బైక్‌పై విన్యాసాలు

● రూ.1.41 లక్షల జరిమానా విధించిన పోలీసులు



బైక్ సాహసాల్లో విద్యార్థులు

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పొంగల్ వేడుకల్లో బైక్ సాహసాలకు పాల్పడిన విద్యార్థులకు పోలీసులు జరిమానా విధించారు. తూత్తుకుడి పాళయంకోట రోడ్డులో ఉన్న వావూసీ కళాశాలలో శనివారం పొంగల్ వేడుకలు జరిగాయి. విద్యార్థులు ఒకే రంగు చొక్కాలు, తెల్లడి ధోవతులు ధరించి హాజరయ్యారు. వేడుకల్లో విద్యార్థినీ, విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వేడుకల్లో జరుగుతున్న సమయంలో పలువురు విద్యార్థులు తమ బైకుల్లో విద్యార్థినుల ముందు సాహసాలకు పాల్పడ్డారు. కళాశాల ముందున్న రోడ్డుపై విద్యార్థులు అతివేగంతో బైక్‌లు నడపడంతో ప్రజలు, వాహనచోదకులు భయభ్రాంతులు చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోగా, బైక్‌ల్లో విద్యార్థులు పరారయ్యారు. ఈ వ్యవహారంలో 14 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదుచేసుకున్న పోలీసులు, సాహసాలకు పాల్పడిన విద్యార్థులకు రూ.1.41లక్షల జరిమానా విధించారు.

సెకండరీ టీచర్ల అంతర్గత రిజర్వేషన్ తగ్గింపు

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పీజీ టీచర్ల నియామకంలో సెకండరీ టీచర్లకు ఇస్తున్న 10 శాతం రిజర్వేషన్ కోటా 10 నుంచి 8 శాతం తగ్గించి, మినిస్ట్రీ ఉద్యోగులకు 2 శాతం కేటాయించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి ఎస్.మధుమతి విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో పీజీ టీచర్ల నియామకంలో సెకండరీ టీచర్లకు 10 శాతం అంతర్గత రిజర్వేషన్ కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో, పాఠశాల విద్యా మంత్రిత్వ శాఖ ఉద్యోగులకు నియామకాల్లో అంతర్గత రిజర్వేషన్ కేటాయించాలని సిఫారసు చేశారు. ఆ ప్రకారం, సెకండరీ టీచర్ల అందజేస్తున్న 10 శాతం రిజర్వేషన్ 8 శాతానికి తగ్గించగా, పాఠశాల విద్యాశాఖలోని సూపర్‌వైజర్లు, అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, షార్ట్ హ్యాండ్ టైపిస్ట్ తదితరులకు 2 శాతం రిజర్వేషన్ కేటాయించినట్లు పేర్కొన్నారు.

బాత్రూమ్‌లు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

● హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల బాత్రూమ్ శుభ్రం చేసేందుకు విద్యార్థినులను పురమాయించిన వ్యవహారంలో ప్రధానోపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటుపడింది. ధర్మపురి జిల్లా పాలకోడు సమీపం పెరుంగాడు కొండ గ్రామంలో ప్రభుత్వ యూనియన్ పంచాయతి మాధ్యమిక పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 150 మంది విద్యార్థులుండగా, ప్రధానోపాధ్యాయురాలు సహా ఐదుగురు టీచర్లు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలోని బాత్రూమ్‌లు శుభ్రం చేయడం, తొట్టెల్లో నీరు నింపడం, పాఠశాల ప్రాంగణం శుభ్రం చేయడం తదితర పనులకు విద్యార్థినులకు ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో, విద్యార్థులు ఈ పనులు చేస్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో జిల్లా ప్రధాన విద్యాధికారి పాఠశాలకు వెళ్లి విచారించగా, విద్యార్థులను పనులకు వినియోగించడం వాస్తవమని తెలిసింది. దీంతో, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలైవాణిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి తెన్రల్ ఉత్తర్వులు జారీచేశారు.

ముగ్గురు ఉద్యోగులకు ఉచితంగా ఇళ్ల పట్టాలు



ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న యజమాని

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకు పైగా పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు పొంగల్ బహుమతిగా యజమాని ఉచిత ఇళ్ల పట్టాలు అందజేశారు. రామనాథపురం జిల్లా పరమకుడిలో సూపర్ మార్కెట్ నడుపుతున్న యజమాని, తన సంస్థలో ఐదేళ్లకు పైగా పని చేస్తున్న ఉద్యోగులకు పొంగల్ కానుకగా ఉచిత ఇళ్ల పట్టాలు అందించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం, పరమకుడి సమీపం మంజల్ పట్టి గ్రామంలో తన స్థలంలో ముగ్గురికి తలా 3 సెంట్ల చొప్పున అందజేశారు. ఆ స్థలం ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రూ.10 లక్షలు ఉండడం గమనార్హం.

చెరకు సాగు చేస్తున్న ఖైదీలు



పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సేలం కేంద్ర కారాగారం ప్రాంగణలో సాగు చేస్తున్న చెరకు, పొంగల్ సందర్భంగా జైళ్లలో ఉన్న ఖైదీలకు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం చెరకు గడల కోత పూర్తయింది. ఈ చెరకును సేలం కేంద్ర కారాగారం, ఆతూర్, ధర్మపురిలోని జిల్లా జైలు సహా 12 శాఖా జైళ్లలోని ఖైదీలకు పొంగల్ సందర్భంగా అందించనున్నట్లు జైళ్ల శాఖ అధికారులు తెలిపారు.

ముగిసిన పుస్తక ప్రదర్శన

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందనం వైఎంసీఏ గ్రౌండ్‌లో పుస్తక ప్రియులను ఆకట్టుకున్న 48వ చెన్నై పుస్తక ప్రదర్శన ఆదివారం సాయంత్రం ముగిసింది. బాపాసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో ఇవిధ భాషల పుస్తకాలను ప్రజలు ఆసక్తిగా కొనుగోలు చేశారు. నవళ్లు, సాహిత్యం, చరిత్ర, తర్జుమా పుస్తకాలతో 100కి పైగా ఏర్పాటైన స్టాల్స్‌లో గత నెల 27వ తేదీ నుంచి విక్రయించారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం 6 గంటలతో పుస్తక ప్రదర్శం ముగిసిందని బాపాసీ కార్యదర్శి మురుగన్ తెలిపారు.

పురుషులు మాత్రమే పాల్గొనే వినోద పొంగల్

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా వానూర్ సమీపంలోని నైనార్ మండపం గ్రామంలో మంగళవారం జరిగే పొంగల్ వేడుకల్లో పురుషులు మాత్రమే పాల్గొననున్నారు. ఈ వినోద పండుగ వేడుకలను కడలూరు జిల్లా చిదంబరం సమీపంలోని కళ్లిడకరై ప్రాంతానికి చెందిన ప్రజలు గత వందేళ్లుగా నిర్వహిస్తు తమిళ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతున్నారు. వెల్లన్‌తాంగి వీరనార్ ఆలయ కోనేరులో ప్రతి ఏటా భోగి, సంక్రాంతి పండుగల సందర్భంగా 50కి పైగా భారీ సైజు మట్టికుండల్లో వండే పొంగలిని స్వామి వారికి నైవేద్యం చేస్తారు. ఈ వేడుకల్లో మహిళలను అనుమతించకుండా తరతరాలుగా పురుషులు మాత్రమే పూజల్లో పాల్గొంటారు.

ఆగని లంక నావికాదళం దాడులు

● 8 మంది రామేశ్వరం జాలర్ల అరెస్ట్

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక నావికాదళం రాష్ట్ర జాలర్లపై చేస్తున్న దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా, సరిహద్దులు దాటారంటూ 8 మంది రామేశ్వరం జాలర్లను లంక నావికాదళం అరెస్ట్ చేసింది. రామేశ్వరానికి చెందిన జాలర్లు శనివారం చేపల వేటకు బయల్దేరి వెళ్లారు. వారు అర్ధరాత్రి కచ్చాదీవి సమీపంలో చేపలు పడుతున్న సమయంలో, వారిని చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటారంటూ 8 మందిని అరెస్ట్ చేసి కాంగేశన్ హార్బర్‌కు తరలించారు. తీరానికి చేరుకున్న సహచర జాలర్లు ఈ విషయాన్ని మత్స్యశాఖ అధికారులకు తెలియజేశారు. శ్రీలంక నావికాదళం దాడులు అధికమవుతున్నాయని, ప్రస్తుతం ఆ దేశ జైలులో ఉన్న జాలర్లు, స్వాధీనం చేసుకున్న పడవలు విడిపించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని జాలర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాష్ట్రపతి భవన్‌లో విందుకు ఇద్దరు రైతులు



ఆహ్వాన పత్రం అందజేస్తున్న తపాలా సిబ్బంది

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ విందులో రాష్ట్రానికి చెందిన ఇద్దరు రైతులకు ఆహ్వానాలు అందాయి. పుదుకోట జిల్లా పరంబూర్ ప్రాంతానికి చెందిన రైతు పొన్నయ్య తన పొలంలో వరి, చేపల పెంపకం చేపట్టారు. ఆయన కేంద్ర ప్రభుత్వ 'జల్ శక్తి అభియాన్' పథకం కింద జాతీయ అవార్డు, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి 'అగ్రికల్చర్ సెమ్మల్' పురస్కారాలు అందుకున్నాడు. అలాగే, పుదుకోట జిల్లా వనపట్టికి చెందిన రైతు అముద పుదుకోట, శివగంగ సహా పలు జిల్లాల్లోని పంటకు డ్రోన్ ద్వారా మందులు చల్లే 'డ్రోన్ పైలెట్'గా వ్యవహరిస్తోంది. ఈ నెల 26వ తేది గణతంత్ర దినోత్సవం రోజున వారిద్దరినీ గౌరవించేలా రాష్ట్రపతి భవన్‌లో జరిగే విందుకు హాజరుకావాలని ఆహ్వానాలు అందాయి.

నగదు నింపారు.. తాళాలు మరిచారు !



మెషీన్‌లో నగదు నింపే చోట ఉన్న తాళాలు

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం మెషీన్ నగదు నింపిన ఉద్యోగులు, తాళాలు వదిలివెళ్లడం కలకలం రేపింది. శివగంగ జిల్లా కారైకుడి కొత్త బస్టాండ్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం ఉద్యోగులు నగదు నింపి వెళ్లారు. అనంతరం నగదు డ్రా చేసేందుకు వచ్చిన వ్యక్తి, ఏటీఎం మెషీన్‌కే తాళాలుండడం గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, బ్యాంక్ అధికారులు అక్కడకు చేరుకొని, మెషీన్‌లో ఉంచిన నగదు వివరాలు పరిశీలించి సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ విషయమై బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ... ఏటీఎం నగదు నింపిన అనంతరం బయట తలుపుకు వేసే తాళాలను సిబ్బంది పొరపాటున వదిలేశారన్నారు. నగదు ఉంచిన వెంటనే ఆటోమేటిక్‌గా లాక్ అవుతుందని, ఆ లాక్‌ను ఉద్యోగులు కూడా తీయలేరని వివరించారు. ముంబై నుంచి అనుమతి లభిస్తేనే మళ్లీ లాకర్ తెరించేందుకు వీలుంటుందని అధికారులు పేర్కొన్నారు.

ధనుర్మాస పూజా ఫలం 30 ఏళ్లు

ప్రవచనకర్త పద్మరాజ్



నగర సంకీర్తనలో పాల్గొన్న వెంకటాద్రి భజన సమాజం సభ్యులు

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాసంలో శ్రీమన్నారాయణుని కీర్తిస్తూ గోదా దేవి రచించిన పాశురాలను 30 రోజులు పారాయణం చేయడం ద్వారా 30వేల సంవత్సరం పూజాఫలం దక్కుతుందని ఆధ్యాత్మిక ప్రవచనకర్త కె.పద్మరాజ్ పేర్కొన్నారు. కొళత్తూర్ సమీపంలోని పొన్నియమ్మన్‌మేడు మోహన్ నగర్‌లో ఉన్న వేంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో మార్గళి మాసోత్సవం 28వ రోజైన ఆదివారం తిరుప్పావై, పాండురంగ పెరుమాళ్, రామ నామం, అన్నమయ్య కీర్తనలు పాడుతు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లను సమాజం నిర్వాహకులు కె.ఐశ్వర్య పర్యవేక్షించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా, ఈ నెల 19వ తేది ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆండాళ్ తిరుకల్యాణోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అయ్యప్పకు స్వర్ణ విల్లు, బాణం, వెండి ఏనుగులు

సికింద్రాబాద్ భక్తుడి విరాళం

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడికి మెడికల్ సీటు వచ్చిందన్న ఆనందంలో శబరిమలైలోని అయ్యప్పస్వామికి తెలంగాణాకు చెందిన ఓ భక్తుడు 120గ్రాముల బంగారంతో తయారుచేసిన విల్లు, బాణం, 400 గ్రాముల బరువైన వెండి ఏనుగులను మొక్కుబడిగా చెల్లించుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి... సికింద్రాబాద్‌కుచెందిన క్యాటరింగ్ సంస్థ యజమాని అక్కరం రమేష్, తన కుమారుడు అఖిల్‌రాజ్‌కు మెడికల్ సీటు వస్తే శబరిమలైలోని అయ్యప్పకు మొక్కుకున్నాడు. ప్రస్తుతం అతని కోరిక నెరవేరి, అఖిల్‌రాజ్ గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో, రమేష్ దంపతులు ఇటీవల శబరిమలై చేరుకొని తమ మొక్కు చెల్లించుకున్నట్లు శబరిమలై ఆలయ నిర్వాహకులు మీడియాకు తెలిపారు.

స్టాలిన్‌కు ఇంత అహంకారం తగదు!

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ధ్వజం

చెన్నై, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు శాసనసభలో జాతీయ గీతాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అవమానించారని, ప్రాథమిక బాధ్యతలను నెరవేర్చమంటూ తాను చెప్పిన హితోపదేశాన్ని ప్రమాదకరమైనదని, పిల్లచేష్టలని తనను యెద్దేవా చేసిన ఆయనకు ఇంతటి అహంకారం తగదని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. ఈ నెల ఆరున తమిళనాడు శాసనసభ తొలి సమావేశంలో ప్రభుత్వ ప్రసంగపాఠాన్ని చదవటానికి ముందు జాతీయ గీతం ఆలాపించాలని గవర్నర్ రవి పట్టుబట్టారు. స్పీకర్ అప్పావు అందుకు నిరాకరించడంతో అలకపాన్పు వహించి సభ నుండి నిష్క్రమించారు. ప్రసంగ పాఠాన్ని పఠించకుండా వెళ్ళిన గవర్నర్ తీరును ఖండిస్తూ స్టాలిన్ విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాజ్‌భవన్ ఎక్స్‌పేజీలో గవర్నర్‌ను తప్పుబడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ చేసిన విమర్శలను ఖండిస్తూ ఓ సందేశం వెలువరించారు. భారతదేశాన్ని ఓ దేశంగా, భారత రాజ్యాంగాన్ని అంగీకరించని, గౌరవించని నాయకుడిలా స్టాలిన్ సామూహిక ప్రయోజనాలు, సిద్ధాంతాలను వంచించారని ఆరోపించారు. ఇలాంటి అహంకారం ఆయనకు మంచిది కాదని, భారతమే మహోన్నతమైన మాతృమూర్తిఅని, ఆమె ముద్దుబిడ్డలమైన మనకు రాజ్యాంగమే సర్వోన్నతమైన ఆశాకిరణమనే విషయాన్ని మరువకూడదని హితవు పలికారు.

కార్ రేసింగ్ పోటీల్లో మూడో స్థానంలో అజిత్ జట్టు

అడయార్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): దుబాయ్ వేదికగా జరుగుతున్న 24హెచ్ కార్ రేసింగ్ పోటీల్లో అగ్రహీరో అజిత్ కుమార్‌కు చెందిన జట్టు విజయం సాధించి మూడో స్థానంలో నిలిచింది. దీంతో జట్టు యజమాని హీరో అజిత్ త్రివర్ణ పతాకాన్ని చేతపట్టుకుని ఎగిరి గంతేస్తూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో భాగంగా, ఆదివారం అజిత్ కుమార్ జట్టు పోర్షే 992 కప్ కార్ రేసింగ్ పోటీల్లో పాల్గొని మూడో స్థానాన్ని దక్కించుకోగా, ఓవరాల్‌గా 23వ ప్లేస్‌లో నిలిచింది. అలాగే, జీటీ 4 కేటగిరీలో స్పిరిట్ ఆఫ్ ది రేస్ అనే అవార్డును కూడా ఆ జట్టుకు నిర్వాహకులు అందజేశారు. కాగా, ఈ పోటీల నుంచి అజిత్ కుమార్ తప్పుకున్నప్పటికీ అజిత్ కుమార్ రేసింగ్ జట్టు విజయం సాధించడంతో ఆయన అభిమానులసంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.ఆసందర్భంగా దుబాయ్‌లోనే ఉన్న హీరో ఆర్. మాధవన్...అజిత్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

బ్యూటీషియన్ దారుణ హత్య

భర్తే నిందితుడు

అడయార్,జనవరి12(ఆంధ్రజ్యోతి):స్థానిక మేడవాక్కంలో బ్యూటీషియన్ దారుణ హత్యకు గురైంది. ఆమె భర్తే ఈదారుణానికి పాల్పడ్డాడు. హత్య అడ్డుకునేందుకు ప్రయత్రించిన ఆమె ప్రియుడు కూడా కత్తిపోట్లకు గురికాగా, నిందితుడుని పోలీసులు అరెస్టు చేశారు.ట్రిప్లికేన్ ప్రాంతానికి చెందిన మణికంఠన్(42)కు జ్యోతి(27)అనే భార్య, జగదీష్, ధనుష్, హరీష్ అనే కుమారులున్నారు. వీరికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా తన ముగ్గురు పిల్లలతో కలిసి జ్యోతి వేరుగా జీవిస్తూ, మేడవాక్కంలో బ్యూటీపార్లర్‌లో పనిచేస్తోంది .అక్కడ తమ బంధువు కృష్ణమూర్తితో అక్రమసంబంధం పెట్టుకుంది.ఈవిషయం తెలుసుకున్న మణికంఠన్... తనతో కలిసి కాపురానికి రావాలని జ్యోతిని పలుమార్లు కోరగా నిరాకరించింది. ఈ నేపథ్యంలో శనివారం భార్య జ్యోతికి ఫోన్ చేసి శబరిమల ప్రసాదం తెచ్చానని, పిల్లలకు ఇచ్చేందుకు తీసుకొస్తున్నానని, పళ్ళికరణైకు వచ్చి తీసుకోవాలని కోరాడు. భర్త మాటలు నమ్మి అక్కడకు వెళ్ళిన జ్యోతితో వాగ్వాదం జరగడంతో ఆగ్రహంతో కత్తితో భార్యపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జ్యోతి అక్కడే మరణించగా, ఈ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కృష్ణమూర్తికి కూడా గాయాలయ్యాయి. మేడవాక్కం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

దారిదోపిడీ కేసులో ఎస్‌ఐ సహా నలుగురికి బెయిల్ నిరాకరణ

ఐసిఎఫ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ ప్రాంతంలో వాణియంబాడికి చెందిన వ్యక్తి నుంచి రూ.15లక్షలు దోచుకెళ్ళిన సంఘటనలో నిందితులైన ఎస్‌ఐ సహా నలుగురికి కోర్టు బెయిలు నిరాకరించింది. వాణియంబాడికి చెందిన వ్యాపారి జునైద్ అహ్మద్ సిటీస్కాన్ పరికరం కొనుగోలు చేసేందకుఉ ఇటీవల తన దగ్గర పనిచేస్తున్న మహ్మద్ గౌస్ కు రూ.20 లక్షలు ఇచ్చి పంపాడు. గౌస్ ఆ నగదుతో ట్రిప్లికేన్ ప్రాంతం వద్దకు రాగా, అక్కడ డ్యూటీలో ఉన్న రాజాసింగ్ అనే ఎస్‌ఐ మహ్మద్ గౌస్ బ్యాగ్ పరిశీలించగా, అందులో ఉన్న నగదుకు సంబంధించిన పత్రాలు చూపించాలని బెదిరించి రూ.15లక్షలు తీసుకొని ఉడాయించాడు. ఆ నగదును ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో పని చేస్తున్న దామోదరన్, ప్రదీప్, ప్రభులతో కలిసి పంచుకున్నారు. ఆ ఘటనపై మహ్మద్ గౌస్ ట్రిప్లికేన్ పోలీసులకు ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసుకొని ఎస్‌ఐ రాజాసింగ్, దామోదరన్, ప్రదీప్, ప్రభులను అరెస్టు చేసారు.ఈనేపథ్యంలో ఆ నలుగురు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా కేసు విచారించిన సిటీ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.కార్తికేయన్ బెయిలు నిరాకరిస్తూ ఉత్తర్వు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లాలో ద్విచక్రవాహనం తాటిచెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. వీరమణి (32), ప్రభు (29), కరుప్పసామి (25) ఆదివారం ఉదయం టీ తాగేందుకు ఒకే ద్విచక్రవాహనంలో బయల్దేరారు. కినత్తుకడవు-సేక్కనూరు బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న తాటి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకొని అక్కడకు చేరుకున్న పోలీసులు, మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని పాదయాత్ర భక్తుడి మృతి

ఐసిఎఫ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో పాదయాత్ర చేస్తున్న ఓ భక్తుడు మృతిచెందిన ఘటన తిరుచెందూర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. విరుదునగర్ జిల్లా శివకాశీ, అన్నయూర్ ప్రాంతానికి చెందిన మురుగన్ అతని కుమారుడు రాజీ (27) తన స్నేహితులతో కలిసి శుక్రవారం తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి దర్శనానికి పాదయాత్రగా బయలుదేరారు. శనివారం ఉదయం తిరుచెందూర్, ఆడైక్కాలాపురం మార్గంలో వెళ్తుండగా వేగంగా వస్తున్న ఓ కారు రాజీని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని స్నేహితుడు తిరుచెందూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం రాజీని తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై తిరుచెందూర్ తాలూక పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రమాదానికి కారణమైన తంజావూర్‌కు చెందిన కారు డ్రైవర్ శ్రీనాధ్‌ను అరెస్టు చేశారు.

బస్సుపై నిలబడి అల్లర్లు .. ముగ్గురు విద్యార్థుల అరెస్ట్

ఐసిఎఫ్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బస్సుపై నిలిచి అల్లర్లకు పాల్పడిన సంఘటనలో ముగ్గురు కాలేజీ విద్యార్థులు అరెస్టయ్యారు. ఈ నెల 9న పూందమల్లి హైవే రోడ్డు, కీల్పాక్కం టైలర్స్ రోడ్డులో సుమారు 15 మంది విద్యార్థులు ఆమార్గంలో వెళ్తున్న సిటీ బస్సుపైకెక్కి కేకలు వేస్తూ హడావుడి చేయడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. ఈ విషయాన్ని వాహనదారులు కీల్పాక్కం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి చేరుకొనేలోపే విద్యార్థులు పారిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణలో అల్లర్లకు పాల్పడిన పచ్చయప్పన్ కళాశాల విద్యార్థులు రెడిహిల్స్‌కు చెందిన జీవ (20) కన్యకాపురంకు చెందిన పవిత్రన్ (20), తిరువళ్లూరు జిల్లా తిరుక్కండల్‌కు చెందిన భువి అరసు (19)గా గుర్తించి అరెస్టు చేసి, పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు.

451 కిలోల గుట్కాతో యువకుడి అరెస్ట్

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మడిపాక్కం ప్రాంతానికి కారులో తరలించిన 450 కిలోల గుట్కాను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రాజస్థాన్ యువకుడిని అరెస్ట్ చేశారు. మడిపాక్కం పరిసరాల్లో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక పోలీసు బృందం శనివారం సదాశివం నగర్ మెయిన్ రోడ్డులో వాహనతనిఖీలు నిర్వహించారు. వేగంగా వస్తున్న కారు ఆపి తనిఖీ చేసి, అందులో 451 కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం రాజస్తాన్‌కు చెందిన సారబ్‌సింగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జీహెచ్‌లో బైక్ చోరీ.. ఇద్దరి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ద్విచక్రవాహనం చోరీచేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పుదుచ్చేరికి చెందిన సురేందర్ పీజీ చదువుతున్నాడు. శనివారం ఉదయం ఆయన తన ద్విచక్రవాహనాన్ని ఆస్పత్రి వెనుక న్యూరాలజీ వార్డు ముందు వైపు పార్కింగ్ చేసి వార్డులోకి వెళ్లాడు. అక్కడ రోగులను పరీక్షించి తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో దిగ్భ్రాంతి చెంది ఆస్పత్రి ప్రాంగణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా శాంథోమ్ కుయిల్ గార్డన్‌కు చెందిన రాజా, శాంథోమ్ డుమిల్‌కుప్పం ప్రాంతానికి చెందిన సురేష్‌ను అరెస్ట్ చేసి, వాహనం స్వాధీనం చేసుకున్నారు. వారిద్దర్నీ కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు ప్రకటనలో తెలిపారు.

నెల్లయప్పర్ ఆలయ ఏనుగు మృతి

అడయార్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తమిళనాడులో అత్యంత ప్రసిద్ధి నెల్లైయప్పర్ ఆలయానికి చెందిన కాంతిమతి అనే ఏనుగు మృతి చెందింది. ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయంలో యేడాది పొడవున వివిధ కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ ఆలయంలో 56 యేళ్ళ కాంతిమతి అనే ఏనుగు ఉంది. నెల్లైయప్పర్, అమ్మాళ్ అభిషేకానికి అవసరమైన పవిత్ర జలాలను తామ్రభరణీ నది నుంచి తీసుకొచ్చేందుకు, ఆలయాల్లో జరిగే వివిధ పూజలు, అభిషేకాలు, గజపూజల్లో పాల్గొనేది. ఈ నేపథ్యంలో ఏనుగు బరువు 4.5 టన్నులకు పెరిగి నడవలేనిస్థితికి చేరుకుంది. ఈ ఏనుగుకు పశువైద్యులు, అటవీ శాఖ అధికారులు అవసరమైన వైద్యం చేయించారు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడిన ఈ ఏనుగు ఆదివారం ఉదయం ప్రాణాలు విడిచింది. భక్తుల కన్నీటి వీడ్కోలుతో మధ్యాహ్నం 1.30 గంటకు ఏనుగు అంత్యక్రియలను పూర్తి చేశారు.

ఈపీఎస్ బంధువు సంస్థల్లో రూ.750 కోట్ల పన్ను ఎగవేత

● ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్‌లో ముగిసిన ఐటీ సోదాలు

● భారీగా నగదు స్వాధీనం

అడయార్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సమీప బంధువు, పారిశ్రామికవేత్త ఈరోడ్ రామలింగం భారీగా ఆదాయ పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఐటీ అధికారుల తనిఖీల్లో తేల్చారు. గడిచిన ఐదేళ్లలో ఆయన ఏకంగా రూ.750 కోట్ల మేర పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఆధారాలతో సహా స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఈ సోదాల్లో రూ.10 కోట్ల నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తుంది. రామలింగం నివాసంలో ఐదు రోజులుగా ఐటీ అధికారులు జరిపిన తనిఖీలు ఆదివారంతో ముగిశాయి. ఈరోడ్ జిల్లా చెట్టిపాళెయం కేంద్రంగా ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ పేరిట ఎస్ఆర్ రామలింగం కంపెనీ నడుపుతున్నారు. ఈ కంపెనీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రాజెక్టులను దక్కించుకుని పనులు పూర్తి చేసింది. అయితే, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో దాఖలు చేసిన ఐటీ రిటర్న్‌లో తమ కంపెనీ ఆదాయాన్ని తక్కువ చేసి చూపించినట్టు ఐటీ అధికారులు గుర్తించారు. ముఖ్యంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.కోట్లలో పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఓ నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్‌తో సహా రామలింగం, ఆయన కుమారులు, కుటుంబ సభ్యులకు చెందిన కార్యాలయాలు, గృహాలు కలిపి మొత్తం 28 చోట్ల ఐటీ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రూ.750 కోట్ల మేరకు ఆయన పన్ను ఎగవేతకు పాల్పడినట్టు గుర్తించారు. అలాగే లెక్కల్లో చూపని రూ.10 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. గత ఐదేళ్ళ కాలంలో రామలింగం, ఆయన కుమారులు సూర్యకాంత్, చంద్రకాంత్ నకిలీ ఖాతాల సృష్టించి పన్ను ఎగవేతకు పాల్పడినట్టు ఆధారాలను సేకరించారు. అలాగే, ఎస్ఆర్ రామలింగం అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తన కుమారుల పేరుతో భాగా ఆస్తులు పోగేసినట్టు కూడా గుర్తించారు. వీటికి సంబంధించిన పత్రాలను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తంమీద 5 రోజుల పాటు సాగిన ఈ ఐటీ సోదాలు ఎట్టకేలకు ముగిశాయి. ఈ ఐటీ తనిఖీలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

తమిళ చిత్రజ్యోతి


'మద గజ రాజా'లో వరలక్ష్మి - విశాల్ - అంజలి

స్నేహితుల కోసం ప్రాణాలర్పించే 'మద గజ రాజా'

విశాల్, సంతానం, సుందర్ కాంబినేషన్‌లో తెరకెక్కి, సుదీర్ఘ కాలం తర్వాత పొంగల్ కానుకగా ఆదివారం విడుదలైన 'మద గజ రాజా' సినిమా థియేటర్లలో నవ్వుల వర్షం కురిపిస్తోంది. సినిమా ఆరంభం నుంచి తెరపై ముగింపు కార్డు పడేవరకు ప్రేక్షకులు కడుపుబ్బ నవ్వుతున్నారు. సాధారణంగా తమిళ చిత్రపరిశ్రమంలో వివిధ సమస్యల కారణంగా సుదీర్ఘకాలం తర్వాత విడుదలయ్యే చిత్రాలు ఘన విజయం సాధిస్తాయనే సెంటిమెంట్ బలంగా ఉంది. ఇపుడు ఈ చిత్రం మరోమారు ఆ సెంటిమెంట్ నిరూపించింది. 2012లో తెరకెక్కి 2013లో విడుదల కావాల్సిన ఈ సినిమా 2025 జనవరి 12న విడుదలైంది. దాదాపు 12 యేళ్ళ సుదీర్ఘ విరామంలో మూడు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. తమిళనాడు రాష్ట్రంలో నలుగురు ముఖ్యమంత్రులు మారారు. ఇలా ఎన్నో మార్పులను అధిగమించి తాజాగా విడుదలైంది. 'తనతో ఉన్నవారికి ఇబ్బంది కలిగితే ప్రాణాలర్పించేందుకు సిద్ధమైన ఎంజీఆర్ అలియాస్ రాజా అలియాస్ మద గజ రాజా (విశాల్) ఒక గ్రామంలో కేబుల్ టీవీ నడుపుతున్నాడు. తన చిన్ననాటి స్నేహితులను (సంతానం - సటగోపన్ రమేష్, నితిన్ సత్య)లను ఓ పెళ్ళిలో కలుస్తాడు. ఆ పెళ్ళిలో సమస్యలను పరిష్కరిస్తుంటాడు. ఈ క్రమంలో తన స్నేహితుల్లో ఒకరికి టీవీ చానెల్ అధిపతి (సోను సూద్) కారణంగా పెద్ద సమస్య ఉందని తెలుసుకుని, స్నేహితుడుకి న్యాయం కోసం సోనుసూద్ ఇంటికి వెళతాడు. అక్కడ నుంచి హీరోకు, రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్న వ్యాపారికి మధ్య ఆధిపత్యపోరు జరుగుతుంది. ఈ పోరులో ఎవరు గెలిచారన్నదే ఈ చిత్ర కథాంశం. సాధారణంగా దర్శకుడు సుందర్ సి సినిమాల్లో ఎలాంటి లాజిక్ ఉండదు. సాధ్యమైనంతవరకు ప్రేక్షకులను ఇరిటేట్ చేయించకుండా కామెడీతో కూడిన స్ర్కీన్‌ప్లేతో ఆడియన్స్ కథలో లీనమై ఎంజాయ్ అయ్యేలా చేస్తారు. అలాంటి సినిమానే ఇది కూడా. ఈ సంక్రాంతికి కుటుంబ సమేతంగా చూడదగిన పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్ మూవీగా ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు.

ఫిబ్రవరిలో 'ప్రభుదేవా వైబ్'



ప్రభుదేవా వైబ్ గ్రాండ్ డ్యాన్స్ షో వెబ్‌సైట్ ఆవిష్కరణ

ఇండియన్ మైఖేల్ జాక్సన్‌గా గుర్తింపు పొందిన ప్రముఖ కొరియోగ్రాఫర్, హీరో, దర్శకుడు ప్రభుదేవా తొలిసారి గ్రాండ్ డ్యాన్స్ షో ప్రదర్శించనున్నారు. 'ప్రభుదేవా వైబ్' పేరుతో ఫిబ్రవరి 22వ తేదీ చెన్నై నగరంలోని వైఎంసీఏ మైదానంలో గ్రాండ్ డ్యాన్స్ షో నిర్వహించనున్నారు. ఇందుకోసం 'ప్రభుదేవా వైబ్' పేరుతో టిక్కెట్ ఆవిష్కరణ శనివారం నగరంలో జరిగింది. అరుణ్ ఈవెంట్స్ నిర్వహించనున్న ఈ భారీ నృత్య కార్యక్రమానికి ప్రముఖ దర్శక నటుడు హరికుమార్ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ డ్యాన్స్ షో కోసం ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ భారీ వేదిక నిర్మించనున్నారు. ఈ ఈవెంట్‌ను మరింతగా గ్రాండ్‌గా నిర్వహించేందుకు వీలుగా ఇబా సంస్థ టిక్కెట్ ఇబా పేరుతో ఒక వెబ్‌సైట్ కూడా ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా 25 వేల టిక్కెట్లను విక్రయించనున్నారు. ఈ సందర్భంగా ప్రభుదేవా మాట్లాడుతూ, 'నాకెంతో మధురమైన క్షణం. అరుణ్ ఈవెంట్స్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. ఇలాంటి ఒక కార్యక్రమాన్ని ఎవరూ ఊహించివుండరు. ఈ ఈవెంట్స్‌కు డైరెక్టర్ హరి కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. సాధారణంగా పాటల చిత్రీకరణలో పలుసార్లు బ్రేక్ తీసుకుంటాం. కానీ, ఈ నృత్యప్రదర్శన అలాంటిది కాదు. ఇందుకోసం రిహార్సల్స్ చేస్తున్నాం. 200 శాతం కష్టపడి, ఈవెంట్‌కు వచ్చే ప్రతి ఒక్కరినీ ఆనందపరిచేలా, సంతృప్తి పడేలా చేస్తాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కలైపులి ఎస్.థాను, ఐసరి డాక్టర్ కె.గణేష్, అరుణ్ ఈవెంట్స్ ఫౌండర్స్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా కోసం సిగరెట్‌కు అలవాటు

సినిమా పాత్ర కోసం సిగరెట్ తాగడం నేర్చుకున్నానని, ఆ తర్వాత తాను ఎంతో ఇబ్బందిపడినట్టు నటి సుమతి తెలిపారు. ఎంజీ రాయన్ - మధు జంటగా నటించిన 'కల్ల నోట్టు'. ఎంజీ రాయన్ కథ సమకూర్చి దర్శకత్వం కూడా వహించారు. విలన్లుగా సుమతి, కుమార్ నటించారు. హీరో స్నేహితుడుగా నా.రంజిత్ కుమార్, మరో ముఖ్య పాత్రలో ఎస్.రాజేంద్రన్ నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు రాయన్ వివరిస్తూ, 'ఇది రాజకీయ సినిమా కాదు. దేశంలో అనేక కరెంట్ అఫైర్స్ చూస్తున్నాం. ఇలాంటి వాటిలో నకిలీ నోట్ల చెలామణి ఒకటి. ఈ సినిమా చూస్తే ఇలాంటి టైటిల్ ఎందుకు పెట్టామో మీకే అర్థమవుతుంది. ఈ సినిమాలో ఎలాంటి వివాదాస్పద అంశాలు లేవు. పేదరికంలో కూరుకున్నవారు, డబ్బుపై అత్యాశతో ఉన్నవారు కలిసి నకిలీ నోట్ల తయారీకి పాల్పడుతూ ఆ కేసులో చిక్కుకుంటారు. దీని నుంచి ఎలా బయట పడ్డారన్నదే ఈ చిత్ర కథ' అని పేర్కొన్నారు. నటి సుమతి మాట్లాడుతూ, 'ఇందులో కరుంగళి అనే పాత్రలో నటించాను. చుట్ట తాగుతూ నటించాలి. ఇందుకోసం సిగరెట్ కాల్చడం నేర్చుకున్నాను. ఆ తర్వాత ఆరోగ్యపరంగా ఇబ్బందిపడ్డాను. అయినప్పటికీ పాత్ర బాగా వచ్చేందుకు ఏవిధంగా కాంప్రమైజ్ కాలేదు. దర్శకుడు కూడా తాను అనుకున్నట్టుగా సన్నివేశం వచ్చేంత వరకు షూట్ చేశారు. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఈ సినిమాను తెరకెక్కించారు' అని పేర్కొన్నారు.


మీడియా సమావేశంలో సుమతి, ఎంజీ రాయన్, తదితరులు

స్త్రీ లేని ప్రపంచాన్ని ఊహించలేం

- జయం రవి


నిత్యా మేనన్, జయం రవి

స్త్రీ లేని ప్రపంచం ఉండదని హీరో జయం రవి అన్నారు. జయం రవి, నిత్యా మేనన్ జంటగా నటించిన రొమాన్స్ థ్రిల్లర్ మూవీ 'కాదలిక్క నేరమిల్లై'. రెడ్ జెయింట్ మూవీస్ బ్యానరుపై కృతిక దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి ఏఆర్.రెహ్మాన్ సంగీతం. జయం రవి, నిత్యామేనన్ యోగిబాబు, వినయ్ రాజ్, టీజే భాను, లాల్, లక్ష్మీ రామకృష్ణన్, గాయకుడు మనో, వినోదిని, రోహన్ సింగ్ తదితరులు నటించారు. ఈ నెల 14న పొంగల్ కానుకగా రిలీజ్ చేస్తున్నారు. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో జయం రవి మాట్లాడుతూ, 'ఈ సినిమా నేమ్ కార్డులో నిత్యా మేనన్ పేరు ముందు వస్తుంది ఎందుకని ప్రతి ఒక్కరూ అడుగుతున్నారు. దీనికి కారణం నాపై నాకున్న నమ్మకం. నా స్ర్కీన్ లైఫ్‌లో చాలా విషయాలు బ్రేక్ చేశాను. షారూక్ ఖాన్ సినిమా చూసిన తర్వాత నిత్యా మేనన్ పేరు ముందు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. స్త్రీ లేకుండా మన ప్రపంచం ఉండదు. వారు లేకుండా మన ఉనికి లేదు. ఇటీవలికాలంలో నేను నటించిన నిరాశపరిచాయి. ఈ సినిమాల కోసం ఎంతగానో శ్రమించాను. అయినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. నిరుత్సాహం చెందడం ఓటమి కాదు. కిందపడిపోయినపుడు పైకి లేవలేకపోవడం అపజయం. ఈ యేడాది ఖచ్చితంగా విజయాన్ని ఖాతాను వేసుకుంటాను' అని పేర్కొన్నారు.

నేడు సీఎం చేతుల మీదుగా 'చెన్నై సంగమం' ప్రారంభం

పెరంబూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పొంగల్ సందర్భంగా నగరంలో 'చెన్నై సంగమం-నమ్మ ఊరు తిరువిళా' పేరుతో నిర్వహించనున్న సాంస్కృతిక మేళాను సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారు. కీల్పాక్కం పెరియార్ ఈవేరా హైరోడ్డు సమీపంలోని ఏకాంబరనాథ ఆలయ మైదానంలో జరుగనున్న ఈ వేడుకల్లో, రాష్ట్రంలోని 250 మంది ప్రఖ్యాత కళాకారులతో నృత్య, సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి. అనంతరం ఈ ప్రదర్శనలు బీసెంట్ నగర్ ఎలియట్స్ బీచ్, తిరువాన్మియూర్ బీచ్, రాజా అన్నామలైపురం, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రాంగణం, ట్రిప్లికేన్ భారతసారన్ సారనియర్ మైదానం, గిండి కత్తిపార జంక్షన్, జాఫర్‌ఖాన్‌పేట కార్పొరేషన్ మైదానం, ఎగ్మూర్ ప్రభుత్వ మ్యూజియం, కీల్పాక్కం ఏకాంబరనాథ ఆలయ మైదానంలో జరుగనున్నాయి. అదే విధంగా రాయపురం రాబిన్‌సన్ పార్క్, పెరంబూర్ మురసోలిమారన్ పార్క్, అన్నానగర్ టవర్ పార్క్, కోయంబేడు జయనగర్ పార్క్, కేకే నగర్ శివన్ పార్క్, వలసరవాక్కం లేమేక్ పాఠశాల మైదానం, కొళత్తూర్ కార్పొరేషన్ క్రీడా మైదానం, అంబత్తూర్ ఎస్వీ మైదానం, టి.నగర్ నటేశన్ పార్క్, నుంగంబాక్కం కార్పొరేషన్ క్రీడా మైదానం తదితర 18 ప్రాంతాల్లో 14 నుంచి 17వ తేది వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగనున్న ఈ ప్రదర్శనలో సుమారు 1,500 మంది కళాకారులు పాల్గొంటారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఉట్టిపడిన గ్రామీణ సంస్కృతి ఆంధ్ర కళాస్రవంతిలో సంక్రాంతి


విజేతలతో నిర్వాహకులు

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు అగ్రహారంలోని ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో గ్రామీణ సంస్కృతికి అద్దం పడుతు ఆదివారం సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కోదండ రామాలయ ప్రాంగణాన్ని మామిడి, అరటి తోరణాలు చెరకు గడలు, రంగవల్లికలతో తీర్చిదిద్దారు. అనంతరం పొంగళ్లు వండి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పండుగ సందర్భంగా ముగ్గులు, వంటలు పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నుంగంబాక్కంలోని వెంకటేశ్వర తెలుగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సంక్రాంతి విశిష్టతపై ప్రదర్శించిన నాటిక అందర్నీ ఆకట్టుకుంది. స్రవంతి అధ్యక్షులు జేఎం నాయుడు, సెక్రటరీ జనరల్ జె.శ్రీనివాస్, కోశాధికారి జీవీ రమణ, సలహాదారులు ఎమ్మెస్ మూర్తి, ఉపాధ్యక్షులు కేఎన్ సురేష్‌బాబు, ఎమ్మెస్ నాయుడు, వీఎన్ హరినాథ్ మహిళా కమిటీ సభ్యుల పర్యవేక్షణలో విజేతలకు బహుమతులుగా బెల్లంకొండ బ్రదర్స్ తరపున సిల్వర్ కాయిన్, ఐఎస్‌పీ గ్రూప్ తరపున ఆయిల్ ప్యాకెట్లు, చిన్నారులు, న్యాయనిర్ణేతలకు బహుమతులు అందజేశారు. వేడుకల్లో ముందుగా గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

'ఫ్యామిలీ సంఘర్షణ'లపై లీగల్ అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న జస్టిస్ భరత చక్రవర్తి, జస్టిస్ కన్నన్ నిర్వాహకులు

అడయార్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): 'కుటుంబాల్లో సమస్యలు, సంఘర్షణలను పరిష్కరించడం, కుటుంబాలను కలిపి ఉంచడం, ఇందుకోసం మధ్యవర్తిత్వం వహించి న్యాయపరంగా నిర్ణయాన్ని తీసుకోవడం' వంటి అంశాలపై న్యాయ సదస్సును నగరంలో తాజాగా నిర్వహించారు. మద్రాస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్, ఫౌండేషన్ ఫర్ కాంప్రహెన్సివ్ డిస్ప్యూట్స్ రిజల్యూషన్ (ఎఫ్‌సీడీఆర్), జాగృతి ఫౌండేషన్ సహకారంతో ది ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌ఎల్ఓ)-చెన్నై ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథులుగా మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.భరత చక్రవర్తి, హర్యానా, పంజాబ్, మద్రాస్ హైకోర్టుల మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.కన్నన్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎంఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెప్టెన్ విజయ్ కుమార్, ఎఫ్‌సీడీఆర్ సహ వ్యవస్థాపకురాలు, సీనియర్ న్యాయవాది పుష్ప సీతారామన్, జాగృతి ఫౌండేషన్ ఫండింగ్ ట్రస్టీ కేపీ చిదంబరం తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో పలువురు న్యాయనిపుణులు పాల్గొని వివిధ సమస్యలపై తమ అమూల్యమైన అభిప్రాయాలను వెల్లడించారు.

అన్నాడీఎంకే కార్యాలయంలో

సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


కార్యాలయ ప్రాంగణంలో పొంగల్ వండుతున్న గౌతమి తదితరులు


ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ వి.సునీల్, ప్రముఖ నటి గౌతమి

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆశీస్సులతో ఆ పార్టీ ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో 915 మంది ఉత్సాహంగా పాల్గొనగా, 23 జట్లు రంగవల్లికల్లో ప్రతిభ కనబరిచి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆదివారం టి.నగర్‌లోని అన్నాడీఎంకే కార్యాలయంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నటి, పార్టీ ప్రచార విభాగం ఉప కార్యదర్శి గౌతమి తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఆర్.పద్మా - అర్చన, సంగీత - మహాలక్ష్మీ, మైథిలి - మంజుల జంటలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ వేడుకల్లో పార్టీ వైద్యవిభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ శరవణన్ ఆత్మీయ అతిథిగా పాల్గొని, నిరాకహకులు, విజేతలను అభినందించారు. అన్నాడీఎంకే టి.నగర్ ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి కె.సూర్యకళ పాల్గొన్న వారికి పొంగల్ కానుకలు తందించారు. వేదిక ప్రాంగణం పొంగిన పొంగలిని స్వామి వారికి నివేదించారు. ఈ వేడుకల్లో హరిబాబు, పద్మనాభన్, తేన్‌మొళి, జయరాయన్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చన

ప్యారీస్, జనవరి12(ఆంధ్రజ్యోతి): స్థానిక పార్క్ టౌన్ ముల్లా వీధిలోని రంగనాథ స్వామి ఆలయంలో పొంగల్ సందర్భంగా శనివారం సామూహిక కుంకుమార్చనను హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. ఆలయ ప్రధాన మండపంలో 350మంది ముత్తయిదువులు విష్ణు నామపారాయణంతో కుంకుమార్చనలో పాల్గొన్నారు.ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ జె.హరికుమార్, డీఎంకే హార్బర్ ప్రాంతీయ కార్యదర్శి ఎస్.మురళి పూజల్లో పాల్గొన్న మహిళలు, భక్తులకు దుప్పట్లు పంపిణి చేశారు.




కుంకుమార్చన ప్రారంభిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు - దుప్పట్లు పంపిణీ చేస్తున్న జె.హరికుమార్, ఎస్.మురళి తదితరులు

సుందరం సంగమమ్‌లో

వాణిజ్య వాహనాలకు పోటీలు


పోటీలలో పాల్గొన్న ట్రక్కులు, లారీల యజమానులతో సంస్థ నిర్వాహకులు

వేలూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య వాహనాలకు, గృహనిర్మాణాలకు రుణాలందించటంలో పేరుగడించిన సుందరం ఫైనాన్స్ సంస్థ రాణిపేటలో వాణిజ్య వాహనాలకు 'ది 2025 పొంగల్ బ్యూటీ కాంటెస్ట్' పేరుతో పోటీలు నిర్వహించింది. 'సుందరం సంగమమ్' పేరుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంచి ట్రాక్ రికార్డు, చక్కగా అందంగా ఉన్న వాణిజ్య వాహనాల యజమానులకు ఈ పోటీలు ఏర్పాటు చేసింది. అందంగా అలంకరించిన లారీలు, ట్రక్కులు తదితర వాణిజ్య వాహనాలు 18 వరకు బారులు తీరాయి. రాణిపేట ఓరియంటల్ ఇన్సూరెన్స్ మేనేజర్ శక్తివేల్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ విశ్రాంత అధికారి జయరాజ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.


టీడీపీ చెన్నై విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నారావారిపల్లెలో మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలుతున్న ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్





ఎంజీఆర్ - జానకి కళాశాలలో పొంగల్ సందడి



ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్‌లోని డాక్టర్ ఎంజీఆర్ - జానకి మహిళా కళాశాల విద్యార్థినులు పొంగల్ పండుగ సందర్భంగా శనివారం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. చిలుక జ్యోస్యం, రాగి అంబలి, గ్రామీన వస్తువుల విక్రయ సంత ఏర్పాటు చేశారు. చెరకు గడలతో నోటిని తీపి చేసుకొని ఆనందం పంచుకున్నారు. నెమిలి నృత్యం, జానపద నృత్యం, గరగాటంతో అందరిని ఆకట్టుకున్నారు. పొంగల్ పండుగను ఆహ్వానిస్తూ సంప్రదాయ వస్త్రధారణతో హరై సాహసక్రీడలు, విన్యాసాలు ప్రదర్శించారు. పల్లెల్లో ఆడే క్రీడల్ని సైతం ఆడుతూ సరదాగా గడిపారు.


జానపద నృత్యాలతో విద్యార్థినీల సందడి

కానుం పొంగల్‌కు 16వేల మంది పోలీసులతో భద్రత


మెరీనా బీచ్‌లో ఏర్పాటైన బ్యారికేడ్లు

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలో ఈ నెల 16న జరిగే కానుం పొంగల్ సందర్భంగా 16వేల మంది పోలీసులతో ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. . గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వుల మేరకు... కానుం పొంగల్ సందర్భంగా మెరీనా బీచ్‌లో ప్రజలు స్నానాలకు దిగకుండా భద్రత కట్టుదిట్టం చేశారు. స్నానాలు నిషేధిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటుచేశారు. పొంగల్ సందర్భంగా నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఇప్పటికే పోలీసులు, 1,500 మంది హోంగార్డులతో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. మెరీనా బీచ్‌లోని శ్రామికుల విగ్రహం నుంచి లైట్ హౌస్ వరకు మూడు ప్రాంతాల్లో తాత్కాలిక మినీ కంట్రోల్ రూమ్‌లు, ఏడు సర్వీసు రోడ్ల ప్రవేశ మార్గాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. రద్దీలో గాయపడే వారి కోసం అత్యవసర వైద్య బృందంతో 8 అంబులెన్స్ వాహనాలు, రెండు అగ్నిమాపక వాహనాలు సిద్ధం చేశారు. అంతేకాకుండా, ముందు జాగ్రత్త చర్యల కింద 200 మంది గజ ఈతగాళ్లను మెరీనా బీచ్ తీరంలో సిద్ధం చేశారు. అదే విధంగా బీసెంట్ నగర్ ఎలియట్స్ బీచ్, రాయపురం కాశిమేడు బీచ్, ఎన్నూర్ బీచ్, పట్టణంబాక్కం బీచ్ తీరాల్లో సముద్ర స్నానాలు నిషేధించారు. రద్దీలో చిన్నారులు తప్పిపోకుండా వారి చేతులకు పేరు, తల్లిదండ్రుల పేరు, చిరునామా, సెల్‌ఫోన్‌తో కూడిన బ్యాండ్ కట్టనున్నారు. గిండి చిల్డ్రన్స్ పార్క్, ఐల్యాండ్ గ్రౌండ్, సెమ్మొళి పార్క్, సినిమా హాళ్లు, వాణిజ్య కాంప్లెక్స్‌ల వద్ద కూడా భద్రత కట్టుదిట్టం చేశారు. ఈసారి కూడా డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు వాహనతనిఖీల్లో పాల్గొననున్నాయి. అదే విధంగా, బైక్ రేస్‌లు పాల్గొనే వారిపై కఠిన చర్యలుంటాయని పోలీస్ కమిషనర్ అరుణ్ హెచ్చరించారు.


పోలీసుల బందోబస్తు